క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని పలు గ్రామాలకు సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రవీణ్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సబ్‌స్టేషన్‌లో పాత బ్రేకర్ తొలగించి కొత్త బ్రేకర్ బిగించే పనులు చేపడుతున్నామని దీంతో మండలంలోని మరికల్, ఇప్పలపల్లి, పుల్లగిరి, గుమ్మకొండ, ఎదిరేపల్లి గ్రామాలకు ఉదయం 7:00 గంటలకు మధ్యాహ్నం 12:00 గంటలకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం, హనుమాన్ దేవాలయాల నిర్మాణానికి గ్రామానికి చెందిన దేవరశెట్టి విశ్వనాథం ఆదివారం రూ.లక్ష విరాళంగా ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు గోవర్ధన్‌రెడ్డి, గౌరీశంకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, సందీప్, శశిధర్, రామచంద్రయ్య, లాలయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

సోము వీర్రాజుకు సన్మానం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ బీజేపీ అధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు సోము వీర్రా జును శాలువాతో ఘనంగా సత్కరించారు. మండలంలో ఓ శుభకార్యానికి ఆయన హాజరయ్యారు. పార్టీ కార్యాలయంలో పలు అంశాలను చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్, శేఖర్ రెడ్డి, రాజేందర్ గౌడ్, రాజశేఖర్, దివాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్‌లో ఆదివారం మాద్గుల జంగయ్యకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.32వేలు మంజూరయ్యాయి. ఆదివారం గ్రామంలో కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కేశమల్ల కృష్ణ లబ్ధిదారుడికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, శ్రీను, తిరుపతినాయక్, రాములు, బాలయ్య, కృష్ణయ్య, మాధవులు, విజేందర్‌రెడ్డి, ప్రవీణ్‌నాయక్, సుధాకర్, అనిల్, అజార్ తదితరులు ఉన్నారు.

దుండగులను శిక్షించాలి

చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లిలో బీజేపీ జెండా దిమ్మెను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి కూల్చిన దిమ్మెను ఆయన పరిశీలించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ తిరుమల్ రావుకు ఫిర్యాదు చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెలమోని కృష్ణ, నాయకులు వెంకట్ గౌడ్, కన్నా, చంద్రారెడ్డి, శేఖర్‌గౌడ్, శరత్, శేఖర్‌యాదవ్ ఉన్నారు.

దాడికి యత్నించిన వారిని అరెస్టు చేయాలి



నాగర్‌కర్నూల్ రూరల్: నాగోల్, బండ్లగూడలోని నవ చేతన విజ్ఞాన కేంద్రం ఎదుట నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులపై దాడికి యత్నించిన బీజేవైఎం నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలస్తీనాపై ఇజ్రాయేల్, అమెరికా చేస్తున్న మారణకాండను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులపై దాడికి యత్నించడం దుర్మార్గమన్నారు. కీర్తి, సుమన్, సబీనా, విక్కి, రాథోడ్, లక్ష్మపతి, విక్రమ్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

వీపనగండ్ల: అటవీ అధికారుల నిర్లక్ష్యంతో మండలంలో అక్రమ కలప రవాణా యథేచ్ఛగా కొనసాగుతుంది. తూముకుంట, సంగినేనిపల్లి, వీపనగండ్ల, బొల్లారం, కల్వ రాల్ల, గోపల్‌దిన్నె గ్రామాల నుంచి చీకటి పడగానే పదుల సంఖ్యలో ట్రాక్టర్‌లు పెబ్బేరులోని కోత మిషన్‌లకు కలపను చేరవేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గట్టి నిఘాను ఏర్పాటు చేసి అక్రమ కలప రవాణాలను అరికట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చెరువుల పునరుద్ధరణ ఎప్పుడో?

- ఏళ్ల తరబడి మరమ్మతుకు నోచుకోని వైనం
- నీటి పారుదల కాల్వలు సైతం అధ్వానం



తుప్పపట్టిన పెద్దరాయినేని చెరువు తూం



మరమ్మతుకు నోచుకోని చీకటిచెరువు తూం

లింగాల: గ్రామాల్లో బోరుబావులకు భూగర్భజలాలు పెరిగేందుకు చెరువులే ఆధారం. చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంటేనే రైతులు పంటలు సాగు చేసేందుకు మొగ్గు చూపుతారు. కాని మండలంలో కొన్ని గ్రామాల్లో చెరువులు శిథిలావస్థకు చేరుకున్నాయి. మండలంలో చెరువులు, కుంటలకు కొన్నేళ్ల నుంచి మరమ్మతుకు నోచుకోకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయి. మండలంలోని అతి పెద్ద చెరువులైన చీకటి చెరువు, పెద్దరాయినేని చెరువుల కింద ఉన్న ఆయకట్టు పూర్తి స్థాయిలో సాగు కాకపోవడంతో రైతులు భూములను బీళ్లుగా ఉంచుకుంటున్నారు. చెరువులు ఏటేటా కుంచించుకు పోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతూ వస్తుండడంతో సమస్యగా మారుతుందని రైతులు వాపోతున్నారు. ఆయా చెరువుల కింద దాదాపుగా 1,000 ఎకరాల మాగాణి భూములు ఉండగా చెరువులు పూర్తి స్థాయిలో నిండితే 600లకు మించి ఎకరాలు సాగు అయ్యే అవకాశాలు లేవని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 7 నోటిఫైడ్ చెరువులు, మరో 20 వరకు కుంటలు ఉన్నాయి. ఇదిలా ఉండగా చెరువులు, కుంటలలో పూడికతీత పనులు చేపట్టక పోవడంతో ఏటేటా నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుండటంతో పూర్తి స్థాయిలో ఆయకట్టు సాగు కావడం లేదని రైతులు వాపోతున్నారు.

శిథిలావస్థకు చేరిన తూంలు

పెద్దరాయినేని చెరువు వర్షాలు బాగా కురిస్తేనే నిండుకుండలా కనిపిస్తుంది. ఈ చెరువుకు కేఎల్ఐ కాల్వల నీరు చేరే అవకాశాలు లేక పోవడంతో వర్షాలపై ఆధారపడి సాగు చేస్తున్నారు. చెరువులో చేరిన నీరు చాలా వరకు వృథాగా పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెరువు తూం షటర్లు తుప్పు పట్టడంతో నీటిని ఆపే వీలు లేకుండా పోయింది. ఎక్కువ శాతం సాగు నీరు వృథాగా పోతుందని ఆయకట్టుదారులు వాపోతున్నారు. తూంతో పాటు అలుగు కూడా కూలేందుకు సిద్ధంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. ఇదే తరహాలో చీకటిచెరువు పరిస్థితి నెలకొంది. దీనికి కేఎల్ఐ నీటితో పాటు, వర్షపు నీరు కూడా చేరడంతో వానాకాలంలో పూర్తి స్థాయిలో నీరు చేరుతుంది. కాగా తూం మరమ్మతులకు నోచుకోక పోవడంతో చివరి ఆయకట్టు వరకు నీటి పారుదల కాల్వలు లేక పోవడంతో పూర్తి స్థాయిలో ఆయకట్టు సాగు చేయలేక పోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతు చేపట్టాలి



చెరువులు, కుంటలకు మరమ్మతు చేపట్టాలి. నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలి. పూర్తి స్థాయిలో ఆయకట్టు సాగు అయ్యేందుకు వీలుగా తూంలను, నీటి పారుదల కాల్వలను బాగు చేయించాలి, అలుగులను బాగు చేయించి ఇబ్బందులు తొలగించాలి.

– సత్యం, రైతు, లింగాల

ఒండ్రుమట్టిని తొలగించాలి



చెరువులు, కుంటలలో పేరుకు పోయిన ఒండ్రుమట్టిని తొలగించాలి. పూడిక పేరుకుపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం గణనీయంగా తగ్గింది. శిఖం భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి. అధికారులు నిర్లక్ష్యం వీడి చెరువులకు మరమ్మతు చేపట్టాలి.

– లింగస్వామి, రైతు, వల్లభాపూర్

ప్రతిపాదనలు పంపించాం

మండలంలోని పెద్దరాయినేని చెరువుకు సంబంధించి వివిధ పనుల నిర్వహణ కోసం రూ.75 లక్షలు, చీకటి చెరువుకు రూ.86 లక్షల ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడుతాం. వల్లభాపూర్ దౌతికుంట మరమ్మతుకు టెండర్లు కూడా పూర్తిగా అగ్రిమెంట్ అయిన వెంటనే పనులు చేపడుతాం.

– ఆర్. చందునాయక్, ఏఈ నీటి పారుదల శాఖ

సేవలు మరింత విస్తరిస్తాం



ఆపరేషన్ చేయించుకున్న వారితో రాఘవేందర్ రెడ్డి

కల్వకుర్తి రూరల్: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవలను మరింత విస్తరిస్తామని ఆ సంస్థ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి చికిత్స శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆపరేషన్ చేయించుకున్న 153 మందితో రాఘవేందర్ రెడ్డి సమావేశమై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని శిబిరాలు నిర్వహిస్తామన్నారు. పేదలకు కంటి సమస్యలు లేకుండా చేయాలని సంకల్పంతో ముందుకు సాగుతున్నామన్నారు. శిబిరంలో 8000 వేల మంది హాజరుకాగా 5000 మందికి పరీక్షలు నిర్వహించామని అందులో 3,000 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. 153 మందికి కంటి ఆపరేషన్లు చేసినట్లు పేర్కొన్నారు. శిబిరం విజయవంతానికి కృషి చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీరాములు, నరేందర్ గౌడ్, యూసఫ్ బాబా, గణేష్, యాదయ్య, శేఖర్, మల్లేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



వెల్దండ: మండలంలోని తిమ్మినోనిపల్లిలో ఆదివారం సీసీరోడ్డు పనులను మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. దొంగ రోడ్డు నుంచి తిమ్మినోనిపల్లి వరకు బీటీరోడ్డు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామానికి బీటీరోడ్డు మంజూరు అయ్యిందన్నారు. కార్యక్రమంలో హరికిషన్ నాయక్, రాజేష్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, శోభన్, రవిగౌడు, నరసింహ, మాధవరెడ్డి, యాదవరెడ్డి, రాములు, శ్రీశైలం, సత్తయ్య, శేఖర్‌గౌడు, శ్రీను, యాదయ్య ఉన్నారు.

మండల కమిటీ ఎన్నిక

బిజినేపల్లి: మండల కేంద్రంలో ఆదివారం స్వేరో జిల్లా అధ్యక్షుడు బండమీది కృష్ణ, కో–కన్వీనర్ గిద్ద విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కాశిపాక స్వామి, ప్రధాన కార్యదర్శిగా కొంగరి శంకర్, ఉపాధ్యక్షులుగా రంజీత్, శ్రీకాంత్‌లను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా హర్షవర్ధన్, బాలకృష్ణ, యుగేంధర్, శంకర్‌ఠాగూర్, దశరథం తదితరులు ఎన్నుకున్నారు.

అచ్చంపేటలో..

అచ్చంపేట రూరల్: పట్టణంలో ఏర్పాటు చేసిన స్వేరోస్ ముఖ్య నాయకుల సమావేశంలో స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ మండల కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా వారణాసి మహేష్, ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా శ్రీను, కోశాధికారిగా రాజేందర్, జాయింట్ సెక్రటరీగా అనీల్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, అభిలాష్, పవన్, రిత్విక్, చరణ్ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో కేసులు నమోదు



లింగాల: మండలంలోని మగ్దూంచౌరస్తాలో ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలో 4 కేసులు నమోదు అయినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్‌గౌడు తెలిపారు. అదే విధంగా వాహనాలకు సరైన పత్రాలు లేని వాహనదారులకు చలాన్లు విధించినట్లు ఎస్ఐ తెలిపారు. రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని కోరారు.

గెల్వాలాంబమాత ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష

వంగూరు: మండల కేంద్రంలోని గెల్వాలాంబమాత ఉత్సవాల ఏర్పాట్లపై ఆదివారం దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, చేపట్టవలసిన పనులపై చర్చించారు. ఉత్సవాల సందర్భంగా టిక్కెట్లు, కొబ్బరికాయల వేలం నిర్వహించారు. అనంతరం హుండీ లెక్కించారు. హుండీ ఆదాయం రూ.81,500 వచ్చిందని దేవస్థాన కమిటీ చైర్మన్ నకినమోని శేఖర్ తెలిపారు. టిక్కెట్ల వేలం ద్వారా రూ.1,71,000, కొబ్బరికాయల వేలం ద్వారా రూ.66వేలు, లడ్డూవేలం రూ.30,500, కొబ్బరి చిప్పల ద్వారా రూ.26 వేల ఆదాయం ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. వచ్చేనెల 13 నుంచి 17 వరకు జరిగే ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందిస్తున్న కృష్ణారెడ్డి

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలలో ఇటీవల అనారోగ్యంతో అల్లాజమ్మ, చెన్నమ్మలు మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఒక్కో కుటుంబానికి రూ.5వేల చొప్పున సమకూర్చి పార్టీ నాయకులకు అందించారు. ఈ మేరకు ఆదివారం బాధిత కుటుంబసభ్యులకు రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు తలసాని కృష్ణారెడ్డి నగదు అందించారు. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పరంజ్యోతి మృతి చెందాడు. పట్టణ పార్టీ అధ్యక్షుడు బావండ్ల మధు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

చారకొండలో..

చారకొండ: మండలంలోని జూపల్లిలో ఇటీవల మృతి చెందిన అంకిల్ల మైసమ్మ దశదిన కర్మ సందర్భంగా ఆదివారం గ్రామంలో కాంగ్రెస్ నాయకులు బాలరాజు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్ర కాంగ్రెస్ యువ నాయకులు కాయితి ఆశాదీప్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కడారి జంగయ్య, చాంద్ పాషా, సంజీవ్, గిరి తదితరులు ఉన్నారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన మొల్గర వెంకటమ్మ అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందింది. మండల రైతు సమన్వయసమితి మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. మాజీ ఎంపీటీసీ బాలస్వామి, ఎండీ గఫూర్, మంగి మురళి, పరశురాములు, నరేష్‌గౌడు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు



శిథిలావస్థకు చేరిన స్త్రీశక్తి భవనం



తాడూరులో నిరుపయోగంగా ఉన్న భవనాలు

తాడూరు: మండలంలోని అకునెల్లికుదురు కమ్యూనిటీ హాల్, డ్వాక్రా భవనాలు రూ. లక్షల నిధులతో నిర్మించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ సముదాయల కార్యాలయాల ఆవరణంలో దాదాపు 15 ఏళ్ల కిందట రూ.లక్షలతో హౌసింగ్ కార్యాలయం, రూ.8 లక్షలతో డ్వాక్రా భవనం, రూ.3లక్షలతో నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాలు శిథిలావస్థకు చేరాయి. భవనాల నిర్వహణ అధికారులు గాలికివదిలేయడంతో నిరుపయోగంగా మారాయని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి భవనాలకు మరమ్మతు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ట్బాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చందాలతో డొంకదారికి మరమ్మతు



రామాజిపల్లి-బల్మూర్ డొంకదారికి మొర్రం వేస్తున్న రైతులు

బల్మూర్: మండల కేంద్రం నుంచి రామాజిపల్లికి రెండు కిలో మీటర్ల మేర రహదారి ఉంది. 15 ఏళ్ల నుంచి వర్షాల తాకిడికి మట్టి కొట్టుకు పోయి డొంకగా మారింది. వ్యవసాయ పొలాలకు ఎడ్ల బండ్లతో పాటు మండల కేంద్రానికి వెళ్లడానికి వీలు లేకుండా అధ్వానంగా తయారైంది. మరమ్మతు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకున్న ఎవరు కూడా పట్టించుకోవడం లేదు. దీంతో నిరాశ చెంది ఈ డొంకదారిని అనుసరించి వ్యవసాయ పొలాలు ఉన్న సుమారు 40 మంది రైతులు రూ.లక్ష వరకు పోగేసుకొని రెండు రోజుల నుంచి ట్రాక్టర్లతో మొర్రం పోసి డొంకదారిని బాగు చేసుకున్నారు. సమస్యలు పట్టని ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామానికి వస్తే నిలదీస్తామని రైతులు హెచ్చరించారు.

సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తిమ్మాజిపేట: కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించడంపై ఆదివారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తిమ్మాజిపేటకు చేరుకొని స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి, ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. వెంకట్రామ్‌రెడ్డి, మల్లయ్యగౌడ్, నాయకులు ఉస్మాన్, శ్రీనివాస్, వివేక్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, బాల్‌రాజ్, మాధవ్, ముబారక్, నాగసాయిలు, వెంకటయ్య, మల్లేష్, పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మా.. కరుణించు



దోమలపెంట: గ్రామ పొలిమేరననున్న మైసమ్మ దేవతకు ఆదివారం దోమలపెంట, ఈగలపెంట ప్రాంతంలోని మహిళలు బోనాలు సమర్పించారు. నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. కొందరు మహిళలు పూనకాలు ఊగారు. ఆలయాన్ని ముస్తాబు చేశారు. కుటుంబసభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. పిల్లాపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

కొల్లాపూర్: పట్టణంలో ఇళ్ల స్థలాల కోసం టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష 19 వరోజు ఆదివారం కొనసాగింది. పట్టణం సమీపంలోని చౌటబెట్ల శివారులో సర్వేనెంబర్ 72లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం గత ప్రభుత్వం భూమి కేటాయించిందన్నారు. ఆ స్థలంలో ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అర్హులైన జర్నలిస్టులకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. దీక్షలో తాటికొండ కృష్ణ, రాంచందర్, జలకం మద్దిలేటి, కురుమయ్య, కారంగి గోవిందు, సీపీ.నాయుడు, రమణ, కేశవులు, భానుప్రకాష్ తదితరులు ఉన్నారు.

అనుమతులు లేకుండా మట్టి, రాళ్లు తరలింపు



కల్వకుర్తిరూరల్: మండలంలోని కురుమిద్ద గ్రామ పరిసరాల నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కాల్వ నుంచి మట్టి, రాళ్లను మూడు టిప్పర్‌లలో కొందరు తరలిస్తున్నారు. అక్రమ తరలింపును గ్రామస్తులు, యువకులు అడ్డుకున్నారు. మూడు టిప్పర్‌లను స్టేషన్ తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతగా నిర్మించుకోవాలి



చారకొండ: ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతగా నిర్మించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు మల్లేపల్లి జగన్ అన్నారు. మండలంలోని పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గోకారంలో 57 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవ్వడంతో 20 మంది లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టారు. గోకారంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను గ్రామ పార్టీ నాయకులతో కలిసి సందర్శించి, నిర్మాణాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ కొండల్, నాయకులు నాగేష్, వెంకటయ్య, ఎల్లయ్య గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్లు చారిత్రాత్మకం



మన్ననూర్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ 42 శాతం ప్రకటించడంపై చారిత్రాత్మకమని కాంగ్రెస్ మహిళా విభాగం కార్యదర్శి, ఉమామహేశ్వర ఆలయ పాలక మండలి సభ్యురాలు సంబు శోభ అన్నారు. ఆదివారం మన్ననూర్‌లోని ఓం చౌరస్తాలో మహిళలతో కలిసి ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. 22 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. బీసీ రిజర్వేషన్లు తమ గొప్పతనంగా కల్వకుంట్ల కవిత చెప్పడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మహిళా నాయకులు మంజుల, పద్మ, పుష్ప, కలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధత కల్పించాలి

కొల్లాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పించే 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని బీఆర్‌ఎస్ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా శ్రీనివాసులు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌పై బీసీలకు అనేక సందేహాలున్నాయన్నారు. కేవలం రాజకీయ లబ్ధికోసమే ఆర్డినెన్స్ జారీచేశారని ఆరోపించారు. బీసీలకు కల్పించిన 42శాతం రిజర్వేషన్లపై ఎవరైనా న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే రిజర్వేషన్లు ఆగిపోయే అవకాశం ఉందన్నారు. బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తోందని ఆయన విమర్శించారు. సమావేశంలో నాయకులు శేఖర్, కురుమయ్య తదతరులు ఉన్నారు.

'రాజకీయంగా ఎవరిని ఎదగనివ్వలేదు'



కల్వకుర్తి టౌన్: నియోజకవర్గంలో రాజకీయంగా మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఎవరిని ఎదగనివ్వలేదని, ఆయన నియంతలా వ్యవహరించారని అందుకే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మనీలా మండిపడ్డారు. పట్టణంలోని ఆదివారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో వైస్ చైర్మన్ పండిత్ రావుతో కలిసి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే కల్వకుర్తి అభివృద్ధిని ఏనాడు పట్టించుకోలేదని విమర్శించారు. పదవిని అడ్డుపెట్టుకొని రియల్ ఎస్టేట్, అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసుకున్నారని ఆరోపించారు. చిల్లర రాజకీయాలు ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. అవాస్తవాలు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కల్వకుర్తిలో నూతనంగా చేపట్టే 100 పడకల ఆస్పత్రిపై మాజీ ఎమ్మెల్యే దమ్ముంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. ప్రస్తుతం ఉన్న సీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేస్తూ, మరమ్మతులు చేసేందుకు ఇచ్చిన ప్రొసీడింగ్‌ను 100 పడకల ఆస్పత్రిగా చెప్పుకొని రాజకీయ పబ్బం గడిపారని విమర్శించారు. ప్రస్తుతం కల్వకుర్తిలో మంత్రుల పర్యటనలో చేసిన 100 పడకల ఆస్పత్రికి ఆర్థికశాఖ అనుమతితో పాటుగా, 4 ఎకరాల స్థలాన్ని కేటాయించేందుకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కృషి చేశారన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ముజ్జు, భీమ్లా నాయక్, రమాకాంత్ రెడ్డి, కొండలు, రాజశేఖర్, కృష్ణయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.